BOOK POST- PRINTED MATTER    Postal Regd.No. VSP-142/2009-2011

★ యేసుక్రీస్తు అందరికి ప్రభువు

# క్రైస్తవనాడు

## ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక

CHRISTAVANAADU
Telugu Fortnightly
e-mail: christavanaadu1@yahoo.co.in

Head Office : D.No. 3-178, 5th Lane,
ADARSH NAGAR, VISAKHAPATNAM-530 040
ANDHRA PRADESH, INDIA.

RNI APTEL /2006/17980
(REGISTRAR OF NEWS PAPERS FOR INDIA)
www.christavanaadu.com

Published from VISAKHAPATNAM | సంపుటి : 4 | సంచిక : 20 | ఎడిటర్ : వై.కనకరాజు | 2010 జూలై 1–15 | పేజీలు : 8+4 | వెల : 5/-

★ రాబోవు దినములలో చిరకాలము వరకు నిత్యము సాక్ష్యార్థముగానుండునట్లు నీవు వెళ్లి వారి యెదుట పలకమీద దీని వ్రాసి గ్రంథములో లిఖింపుము.

★ ఈమాటలు నమ్మకమును నిజమునైయున్నవి గనుక వ్రాయుమని ఆయన నాతో చెప్పుచున్నాడు




(గత సంచిక తరువాయి.....)

మహా జలప్రళయంతో ఈ భూమి నాశనమయిందని అనేక దేశాల్లో దీనికి ఆధారాలు లభ్యమవుతున్నట్లు ఈ మధ్యకాలంలో తరచూ వింటున్నాం.

ఇందుకు చాలా మతాలకు సంబంధించిన గ్రంథాల్లో కూడా ఆధారాలున్నాయని తెలుస్తుంది.

ఇదే విషయాన్ని క్రైస్తవేతర ఆధ్యాత్మిక వాదులు కూడా చెబుతుంటారు. మునుపటి చరిత్రలో కూడా దీనికి నిదర్శన ముందంటున్నారు. ఏదేమైనా ఆధ్యాత్మిక వాదులైనా, శాస్త్రవేత్తలైనా ఈ విషయాన్ని ఏకగ్రీవంగా ఒప్పుకుంటున్నారు. అందువల్ల భూమి పూర్వకాలంలో జలప్రళయానికి లోనైందన్నది నిజం.

జలప్రళయాలైనా, అగ్ని పర్వతాలు బ్రద్దలగుట్టైనా ప్రకృతివల్లే సంభవం. ప్రకృతి సంభవాలైన వీటివల్ల మానవజాతైనా, సృష్టైనా సమూల నాశనం జరిగి లయమగుటకు అవకాశముంది. జల ప్రళయాన్ని గూర్చి బైబిలేమంటుందో చూద్దాం.

**★ సముద్రజలములను పిలిచి వాటిని భూమి మీద ప్రవహింపజేయువాడును ఆయనే**

చూశారా! దేవుని శక్తిని బైబిలెలా తేటతెల్లం చేస్తుందో! భూగోళాన్ని నాశనం చేయగల అణుబాంబులు తగినన్ని దేశాలవద్ద ఉన్నాయని, అవి పేలితే భూప్రపంచం భష్మీపటలం కాకతప్పదని చెబుతుంటారు. ఇది జరిగేపనికాదని మనం విశ్వసించవచ్చు. ఎందుకంటే ప్రజలకు తెలుసు... అదే జరిగితే ఎవరూ మిగలరని. కాబట్టే అనుదినం ప్రపంచంలో గల దేశాలు ఒకదాన్ని మరొకటి గమనిస్తూనే ఉన్నాయి. తగిన హెచ్చరికలు చేస్తూ కట్టడి చేస్తున్నాయి.

కట్టడికి లొంగని దేశాన్ని మిగతా కొన్ని దేశాలు ఏకమై లొంగ దీస్తున్నాయి. ఇది ఇంతవరకు జరిగిన చరిత్ర. ఇక ముందు కూడా జరిగేదిదేనని మనం తలంచవచ్చు. మనలో మనం కట్టడి విధించుకొని సృష్టిని, తద్వారా మనల్ని, లయం కాకుండా కాపాడుకొంటున్నాం. కానీ సృష్టే మనపై సునామీగానో, జల ప్రళయంగానో, అగ్నివడగండ్ల గానో దేవునికి మనపై గల కోపం వలన తిరిగబడితే మన పరిస్థితేంటి? వాటినెలా కట్టడిచేయగలం. భూకంపాలొస్తే ఎలా తప్పించుకోగలం? దాన్నెలా కట్టడి చేస్తాం? ఆలోచించండి! లేదా దేవుని వాక్యం మనమెలా రక్షింపబడతామో చెబుతుంది చదవండి....

**★ విధి నిర్ణయము కాకమునుపే యెహోవా కోపాగ్ని మీ మీదికి రాకమునుపే కూడిరండి. దేశములో సాత్వికులై ఆయన న్యాయవిధులననుసరించు సమస్త దీనులారా, యెహోవాను వెదకుడి; మీరు వెదకి వినయము గలవారై నీతిని అనుసరించిన యెడల ఒకవేళ ఆయన ఉగ్రత దినమున మీరు దాచబడుదురు.**

మనలో మార్పుకనబడకపోతే, దేవకృపకు పాత్రులుగా మారకపోతే జరిగేనష్టాన్ని అంచనా వేయగలమేగాని అడ్డుకోలేము. ఎందుకంటే భూకంపం వచ్చి లయం చేసిన తర్వాత దాని తీవ్రత రిక్టర్ స్కేలుపై ఎంతుందో చెప్పగలం. ఎంతమంది క్షతగాత్రులయ్యారోనని లెక్కలు కడుతున్నాం. మరెంతమంది ప్రాణాలు పోగొట్టుకున్నారో ఎంతమంది నిరాశ్రయులయ్యారో తేల్చి చెబుతున్నామేగాని నివారించలేకపోతున్నాం. ప్రస్తుతం అటువంటి జ్ఞానం మనిషికి ఇంకా అందలేదని చెప్పవచ్చు. ప్రకృతి భీభత్సాన్ని అరికట్టాలంటే దేవుడే శరణ్యం. ప్రకృతి ద్వారా లయమగుతున్నప్పటికంటే లయమవకముందే లయకర్తయైన దేవుని వేడుట సమంజసం.


(వచ్చే సంచికలో....)

## జగన్ ఓదార్పుయాత్రతో కాంగ్రెస్‌లో కలవరం?




సోనియా గాంధీ ఆశీస్సులు లేకున్నా జగన్ తన ఓదార్పుయాత్రను దివంగత ముఖ్యమంత్రి డా. వై.యస్.రాజశేఖరరెడ్డి జన్మదినాన ఉత్తరాంధ్రలో మొదలుపెట్టారు. ఆ యాత్రానంతరం తూర్పు గోదావరి జిల్లాలో కొనసాగిస్తున్నారు.దీనివల్ల పార్టీలో అనేక లుకలుకలు బయటపడ్డాయి.

## తొలి ప్లీనరీ



ప్రజారాజ్యం పార్టీ తొలి ప్లీనరీ సమావేశం ఆగష్టు 26,27 తేదీల్లో విశాఖలో జరుప నున్నట్లు తెలుస్తోంది.

## రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా జరిగిన జన్మదిన వేడుకలు



4-7-2010
రాష్ట్ర ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య గారు



8-7-2010
దివంగత ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర రెడ్డి గారు

## ఉప ఎన్నికల్లో పట్టుబిగిస్తున్న కేసీఆర్



ఎన్నికలు దగ్గరపడుతున్న కొలది తనదైన శైలితో తెలంగాణా జిల్లాల్లో కేసీఆర్ పట్టుబిగిస్తున్నారు. ఓ వైపు ఎలక్షన్ కమీషన్ నాయకులను సంజాయిషీలను కోరుతూ మందలిస్తుంది. నోరు జారకుండా ఉండాలని వార్నింగులతో హెచ్చరిస్తుంది. తెలంగాణా ప్రాంతీయులను ఏకం చేయుటలో టిఆర్ఎస్ పార్టీ కృతకృత్యమైనట్లే కన్పడుతోంది. అందుకు తగ్గట్లే కాంగ్రెస్ వర్గీయులు, తేదేపా వర్గీయులు తమ తమ పావులను కదుపుతున్నారు. తెలంగాణాకు ఈ ఎన్నికలు రిఫరెండమని ఒకరు, కాదని మరో వర్గంలో చర్చలు, సవాళ్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఓటర్ల తీర్పు తెలియాలంటే ఆగష్టు మొదటి వారం వరకు ఆగాల్సిందే.

## రాష్ట్రానికి కొత్తగా రాబోతున్న కేంద్రీయ విద్యాలయాలు


2012 కల్లా దేశంలో 107 కేంద్రీయ విద్యాలయాలు కొత్తగా రాబోతున్నాయి. మంత్రివర్గం తీసుకున్న ఈ నిర్ణయాన్ని కేబినెట్ ఆమోదించింది. దేశవ్యాప్తంగా దీనివల్ల సుమారు కోటికి పైగానే విద్యార్థులు లబ్ధిపొందగలరని అంచనా. అందుకు అవసరమైయ్యే బడ్జెట్ కూడా 527 కోట్ల పైమాటే. అందుకు భాగంగానే మన రాష్ట్రానికి మూడు వరకు కేంద్రీయ విద్యాలయాలు వస్తాయని తెలుస్తోంది.


**5వ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న క్రైస్తవనాడు**
**ఉత్తరాంధ్ర జిల్లాల... క్రైస్తవపేపర్లలో**
**ఇదే ఓ రికార్డ్**
**ఆర్టికల్స్, అభినందనలు, శుభాకాంక్షలు, సద్విమర్శలు పంపగోరు వారు వెంటనే పంపాలని కోరుతున్నాం. ఆగష్టు 8వ తేదీలోపున మాకు అందాలి -ఎడిటర్**




★ సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు ఎంత మనోహరము

# పరిచర్యలో దేవుని కుటుంబాలు









(గత సంచిక తరువాయి.....)

మీ జీవితంలో ఒక సంవత్సరం అంటే ఒక సంవత్సరమేకావచ్చు. కొందరి విషయంలో ఒక సంవత్సరమంటే 10 సంవత్సరాలుగా లెక్కించవచ్చు. అంటే మొదటి పది సంవత్సరాలు అదే పండుతుంది. అలాగే రెండో 10 సంవత్సరాలు అలాగే పండుతుంది. కానీ మూడో పది సంవత్సరాలు కష్టించి పండించుకొని తినాలి. ఇది దేవుని ప్రణాళిక. ఇలాగుననే మరి కొందరి జీవితంలో 1 సంత్సరం అంటే 5 సంవత్సరాలు కావచ్చు. 2వ సంవత్సరం అంటే 10, 3 సంవత్సరం అంటే 15 సంవత్సరాలు కావచ్చు. వారి వారి క్రియలు, చేస్తున్న పరిచర్యలు దేవుని దృష్టిలో ఆయా సంవత్సరాలుగా లెక్కించబడవచ్చు. కాబట్టి సేవా పరిచర్యలు చేస్తున్న కుటుంబాలు లెక్క చూచుకొని జాగ్రత్త పడాలి. తాము ఏ సంవత్సరాల లెక్కలోకొస్తామోనన్నది ఎరగాలి. లోపాలుంటే సవరించుకొంటూ దేవుని వేడాలి. దేవుడు క్షమించే గుణం కలవారు. అందువల్ల దేవుడు మనల్ని మొదట్లో ఆయాచితంగా ఇతరుల వల్ల పోషిస్తుంటే ఇదే బాగుంది, దేవుడు మా ప్రార్థన విన్నారు. ఆశీర్వదించేస్తున్నారు, అన్న భ్రమలో ఉండకండి. ఆయన మాట తప్పని వారు. తన స్వభావానికి అనగా బైబిల్లో బయల్పరచినదానికి విరోధంగా ఆయన ఏమీ చేయరు అని బైబిలు ఖండితంగా చెబుతుంది. దేవుని సేవలో బలంగా ఉండేందుకు లేఖనాలే ఆధారం. లేదా సేవ మీ యొద్దనుండి తీసివేయబడి మరొకరికి అప్పగించబడుతుంది. అతని ఉద్యోగము వేరొకడు తీసికొనునుగాక అన్న లేఖనం నేడు ఎందరి యెడలో నెరవేరింది. అందు మనమే కాదు గాని అనేక చోట్ల క్రైస్తవేతరుల్లో కూడా అలా తమ ఆస్తులు, వ్యాపారాలను ఇతరులకు అప్పగించుకొన్న వైనాలు కన్పడతాయి. దేవునికి మనతో సహా దేవున్ని ఎరుగనివారూ బిడ్డలే. ఈ క్రైస్తవ, క్రైస్తవేతర తేడాలు మనకే గాని దేవునికి లేవని ఎరగండి. ఈ విషయం బైబిల్లో మనం చూడగలం. దేవునికి పక్షపాతం ఏ కోశానా లేదు. సేవా పరిచర్యల్లో భయభక్తులు, యథార్థత కన్పర్చాలి. అప్పుడు దైవాశీర్వాదాలు వాటంతటవే మనల్ని వెన్నాడుతాయి. ఆశీర్వాదమంటే కుటుంబాలతో సహా తరతరాలు సువార్తా పరిచర్య చేయడమే. అందుకు సాక్ష్యంగా నేడు మనందరికి తెలిసిన కుటుంబం డి.జి.యస్. దినకరన్ కుటుంబం. ప్రస్తుతానికి మూడు తరాలు సేవలో తరిస్తున్నాయి. ఈ ఆశీర్వాదం మరిన్ని తరాలు సాగుతుందన్న నమ్మకం సహో. పాల్ దినకరన్ తన పిల్లలను సేవలో ఉంచి నడిపించుట వలన కన్పరుస్తున్నారు. ఆయన కుటుంబాన్ని బట్టి దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లింపకుండా ఎవరుండగలరు? ఆలోచించాలి. సేవలో అలాంటి కుటుంబాలు ఎన్నో ఉన్నాయి. మరోసారి మరో ఘన క్రైస్తవకుటుంబాన్ని గూర్చి తెలుపుతాం. క్రైస్తవనాడు విస్తరించేట్లు ప్రార్థించమని కోరుతున్నాం. తద్వారా మాకుటుంబం కూడా మరింత ఆశీర్వదించ బడుతుందని మా నమ్మకం.

**దేవుని కృప, మీ ప్రార్థనాసహకారాల వలన 5 వ సంవత్సరంలోకి ప్రవేశిస్తున్న 'క్రైస్తవనాడు' కొరకు మీ కుటుంబ ప్రార్థనల్లో మరింత ప్రార్థించ మనవి**

**ఇప్పుడు వెబ్‌సైట్‌లో మన క్రైస్తవనాడు**
**www.christavanaadu.com**

## సర్వోన్నతమైన గౌరవం!

# సహోదరుడు (Brother) / సహోదరి (Sister)

అవును! ఇది నిజం!! కానీ అందుకు భిన్నంగా మనలో అత్యధికులు తమ పేర్లకు ముందర, వెనుక అనేక రకాల బిరుదులు, డిగ్రీలు తగిలించుకొంటూ అల్పసంతోషులుగా కన్పడుతుంటారు. అల్పసంతోషులు అనేందుకు కారణం ఉంది. వారి దృష్టిలోను, వారికా బిరుదులు, డిగ్రీలు ఇచ్చిన వారి దృష్టిలోను అవి గొప్పవే కావచ్చు. ఆ బిరుదులు గలవారినీ ఆశ్రయిస్తూ... వారిని పొగడుతూ... తమ బ్రతుకులు నిర్వీర్యంగా వెళ్లదీస్తున్న మరి కొందరికవి మరి గొప్పగా కన్పడొచ్చు. ఆ బిరుదాంకితులు కూడా లోకంలోనున్న మిగిలిన క్రైస్తవులకంటే ఆ బిరుదులవల్ల తామే గొప్పవారిమన్న భ్రమలో బ్రతకొచ్చు. అట్టి అతిశయం మిగిలిన వారినుండి తమను వేరుపరుస్తుందని అట్టి బిరుదాంకితులు ఎంత వేగంగా గుర్తించి సరిచేసుకొంటే అంతమంచిది. అసలు సేవా పరిచర్యలతో తమ తరము వారికి క్రీస్తును బోధించువారికి అట్టి బిరుదులు, డిగ్రీలు అవసరమా? క్రైస్తవుల వల్ల యేసు బోధలు విన్నవారు, క్రీస్తు ప్రేమను బట్టి మన ద్వారా సహాయ సహకారాలు పొందేవారికి ఈ బిరుదులు, డిగ్రీలు ఏం ఉపయోగపడతాయి? మీకు బిరుదులు, డిగ్రీలు ఉన్నవా? ఉంటేనే మీ బోధలు వింటాం, మీ సహాయ సహకారాలు మేము పొందుతాం అని వారంటారా? ఆలోచించాలి. పరిచర్య చేయువారికి బిరుదులు, డిగ్రీలు అక్కర్లేదు. బైబిలు చదివే పాటి చదువుంటే చాలు. దైవోద్దేశ్యాలు గ్రహించేందుకు దైవాత్మను పొందే హృదయశుద్ధి ఉంటే చాలు. తాము గ్రహించిన యేసుక్రీస్తుని గురించిన వివరణలు ఇతరులకు తెలియజెప్పగలరు. తమకున్న దాంట్లోనే ఇతరులకు సహకరించే దైవికలక్షణం దినదినం దేవుని కృపవలన అభివృద్ధి పరచుకోగలరు. అందువల్ల నిజంగా యేసు చెప్పినట్లు సేవ చేయువారు లోకంలో గొప్పలకు పోరు. అట్టి అవసరం వారికుండదు. లోకంలో గల జీవపుడంబాన్ని తమ బ్రతుకుల్లో బిరుదులు, డిగ్రీల ద్వారా కనబర్చేవారు ఎట్టికోవకు చెందుతారో మీకు నేను ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. నేత్రాశ, శరీరాశ, జీవపు డంబం కూడదంటోంది బైబిలు. లేఖనాలను అతిక్రమణ చేసి బాగుపడిన దాఖలాలు ఎక్కడాలేవు, ఎవరికీ లేవు. అందుకే జీవపుడంబం వెలగబెట్టిన అట్టి వారెందరో రోజులు గడుస్తున్న కొలదీ సేవలో దిగజారిపోతున్నారు. తమ సాక్ష్యాలు, కుటుంబ సాక్ష్యాలు పోగొట్టుకుంటుంటారు. కొందరైతే తమకు భవిష్యత్తే లేకుండా చేసుకుంటున్నారు. ఇవన్నీ నేడు మన కళ్లెదుట జరుగుతూ సాక్ష్యంగా అనేకులకు కన్పిస్తున్న నిత్యసత్యాలు.

యూనివర్సిటీల్లో ఓ 'డాక్టరేట్' ఇవ్వాలంటే అందుకెన్నో ప్రమాణికాలుంటాయి. అది ఎంతో కష్టతరమైన సంగతి. అప్పటివరకు విశ్వవ్యాప్తంగా ఏ విశ్వవిద్యాలయాల్లోను అట్టి థియరీ ఎవరూ సమర్పించి ఉండరాదన్నది గమనార్హం. తాము సమర్పించిన పరిశోధనా సారాంశం నూతనమైనదై ఉండాలి. అలా ఎన్నో విధాల పరీక్షించిన తర్వాతే ఆయా వ్యక్తులకు యూనివర్శిటీలు డాక్టరేట్లను ఇస్తాయి. మరికొందరికి గౌరవ డాక్టరేట్లు ఇస్తుంటాయి. అందుకూ ఎన్నో ప్రామాణికాలుంటాయి. వారు సమాజానికి మేలు చేసేవారై ఉండాలి. అవి కళల ద్వారా నైనా, సామాజిక సేవల ద్వారానైనా లేక తమ కష్టార్జితంతో ఆపన్నులను ఆదుకొనుట ద్వారానైనా వారి సేవలు లోకస్థులచే గుర్తించబడాలి. ఇంకెన్నో ఇలాంటి సంగతులు ఆయా వ్యక్తుల జీవన విధానాల్లో చూచి వారికి గౌరవ డాక్టరేట్లు ఇస్తుంటాయి యూనివర్శిటీలు. (వచ్చే సంచికలో)

# సేవకు 580 కోట్ల దానం!

హెచ్ సి యల్ సాఫ్ట్‌వేర్ సంస్థాధిపతి సామాజిక సేవకు దానం చేసింది 580 కోట్లు. మనం దేశంలోను దానాలు చేస్తూ సామాజిక సేవకు సహకరిస్తున్న వారి సంఖ్య దినదినం పెరుగుతునే ఉంది. అందుకు దేవునికి స్తోత్రం. అలాంటి దాతలను కొత్తగా 'మనలోనూ' మరెందర్నో లేపాలని, ఉన్నవారిలో అందర్నీ పురిగొల్పాలనీ 'మన' అనుదిన ప్రార్థనల్లో గుర్తుచేసుకొందాం. క్రైస్తవులుగా ఇది మన భాద్యత!

యెహోవాయందు నమ్మకముంచువాడు వర్ధిల్లును-బైబిల్

SAHITHI CERAMICS

ALL WALL & FLOOR TILES



SANITARY WARE

#48-1-22/2, Srinagar, Near Ramatalkies, Visakhapatnam-16

Phone : 0891-6455880, Mobile : 92 91 49 18 15

క్రైస్తవనాడు లో ప్రకటన ధరలు

వివరాలు సంపూర్ణంగా తెల్సుకొనేందుకు సంప్రదించండి!

| B&W | FULL PAGE | HALF PAGE | QTR. PAGE |
|---|---|---|---|
| FRONT PAGE | ***** | 4,500/- | 2,250/- |
| CENTRE PAGES | 5,000/- | 2,500/- | 1,250/- |
| REAR PAGE | 8,000/- | 4,000/- | 2,000/- |

| COLOUR | FULL PAGE | HALF PAGE | QUATER PAGE |
|---|---|---|---|
| FRONT PAGE | ***** | 9,000/- | 4,500/- |
| CENTRE PAGES | 8,000/- | 4,000/- | 2,000/- |
| REAR PAGE | 16,000/- | 8,000/- | 4,000/- |

ఫోన్స్ : 9346960601, 9490266640, 9292006116

Syam Thota (TSR) యెహోవాయందు నమ్మకముంచువాడు వర్ధిల్లును-బైబిల్

Sahithi Jewellers

BODWIN COMPLEX, SHOP NO. : 6

D.NO. : 25-8-270, NEAR READING ROOM,

VISAKHAPATNAM -530 001

Phone : 0891-6588102, Mobile : 8019465576

క్రైస్తవనాడు
ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక

సంపుటి : 4 సంచిక : 20 1-15 జూలై, 2010



★ ★ ★

# చలనం

విశ్వమంతా చలిస్తుందన్నది మనమెరిగిందే. విశ్వం అంటే అందున్న సమస్తం. ఆ సమస్తంలోనే మనమున్న భూగోళం ఓ చిన్న భాగం. ఆ చిన్న భాగంలోనే ఉన్న మనం ఆ దృష్ట్యా మరిచిన్న వాళ్లం. అయినా అందులో కూడా మనకంటే చిన్నవి, పెద్దవి, సాధు, క్రూర, జంతు, కీటక, జలచరాలెన్నో కలవు. అన్నీ చలించేవే. విశ్వంలో గల ప్రతి వస్తువూ చలించేదే. ఈ మహా విశ్వాన చలిస్తూ మిగితా వాటిపై ఆధిపత్యం చలాయించే మనదొక ప్రత్యేక జీవన శైలి. మన జీవన విధానంలో కాలక్రమేణా అనేక మార్పులు, కట్టుబాట్లు, వావి వరుసలు, ఎక్కువ తక్కువ భేదాలు, ధనిక బీద తారతమ్యాలేగాక పారంపర్యాచారములు కొన్ని చలిస్తూ మన ఎదుగుదలతోబాటు ఎదుగుతున్నాయి. మరి కొన్ని పారంపర్యాచారములు మృగ్యమైపోతున్నాయి. అలా మృగ్యమైపోయే వాట్లో మంచివి ఉండకుండేట్లు చెడువి మాత్రమే ఉండేట్లు మనమే జాగ్రత్త పడాలి. మన ఎదుగుదలతోబాటు మంచి ఎదగాలి, చెడు తగ్గాలన్నది ప్రాముఖ్యం. విశ్వంలో మనకు కన్పించే, కన్పడని ప్రతి వస్తువూ... తుదకు మనం కూడా నిత్యం చలిస్తూనే ఉంటాం. అదే సృష్టి వైచిత్రి. చలిస్తూ ఓ నాటికి ఎవరికీ కనబడకుండా పోతాం. ఇందులోనూ మనదే ప్రత్యేకం. సృష్టిలో మరే జీవికి లేని భాగ్యం మనకోటుంది. కోటానుకోట్ల జీవులు నశిస్తున్నా వాటిని గుర్తించం. కానీ మనం ఈ లోకం వీడినా అనేక గుర్తులుంచిపోతున్నాం. రాబోవు తరానికి అవి ఓ జ్ఞాపకం. ' మనకు ఊహ తెలిసినప్పటినుండి మన చలనం ఎలా ఉందన్నది ఎరుగుతూ చలిస్తుంటే ఆ చలనం వల్ల లభించే జీవితం అనేక తరాలకు మార్గదర్శి. విశ్వంలో మనల్ని ఇంత ప్రత్యేకంగా నిర్మించి జీవింపజేస్తున్న దేవుడు మన జీవిత చలనానికి మార్గనిర్దేశకుడైతే ఆ జీవితం ఈ లోకాన మరింత గొప్పదిగా అనేక తరాల వారికి వెలుగునిస్తుంది '. విశ్వంలో ప్రతి వస్తువూ చలనం కలిగి ఉంటూ అనాదిగా ఆయన ఆజ్ఞను పాటిస్తున్నాయని బైబిలు చెప్తుంది. వాటిలా దేవుడు మనల్ని చేయలేదు. మనల్ని ఆయనవలే స్వయిష్టాలు నెరవేర్చుకొనే స్వతంత్రుల్నిగా చేసారు. దేవున్ని నమ్ముట నమ్మకపోవుటన్నదాంట్లో ఎవరిష్టం వాళ్లది. ' ఈ లోకంలో మన చలనం ఎలా ఉంటే అందరికీ ఆశీర్వాదకరంగా ఉంటుందో సంపూర్ణంగా తెలియజేసే గ్రంథమైన బైబిలును దేవుడు ఇచ్చారు. ఇది ఆయన ఉచిత కృప. ఆ గ్రంథాన్ని చదివినంత మాత్రాన లాభం లేదు. చదివిన దాన్ని గ్రహించి ఆచరిస్తేనే మనం దేవుని పిల్లలంగా దేవునిచే గుర్తించబడతాం '. దేవుని సృష్టే చలనంలో ఓ క్రమాన్ని కన్పరిస్తే... ఆయన పిల్లలంగా మనం మరెంత క్రమాన్ని మన బ్రతుకు చలనంలో కన్పరచాలోనన్నది అనుక్షణం గుర్తెరగాలి.

★ "ప్రభువు వాక్యము శీఘ్రముగా వ్యాపించి మహిమ పరచబడు నిమిత్తము...... మా కొరకు ప్రార్థించుడి"

వై.కె.

గమనిక : మీ రచనలు, వ్యాసాలు, ప్రసంగాలు, కవితలు, పద్యాలు, ఏవైనా సరే మేము ప్రచురించాలంటే భారతదేశ సార్వభౌమత్వానికి, భారత రాజ్యాంగానికి భిన్నంగా ఉండరాదు. లోకోక్తులు, టిప్స్, జనరల్ స్టడీ బిట్స్ సేకరణలని గమనించగలరు.

'వివేకియైనవాడు తన విద్యను దాచి పెట్టును' అన్న బైబిలు వాక్యాన్ని బట్టి వై.కె.రాజు, వై.ఎల్. రవిరాజుల రచనల్లోగల వాక్యాలకు ★ గుర్తు ఇవ్వడమైంది.

క్రైస్తవనాడులో ప్రచురించబడే ఇతరుల రచనలు ఆయా రచయిత / రచయిత్రిల వ్యక్తి గత అభిప్రాయాలు మాత్రమే. పత్రిక పాలసీకి ఎటువంటి సంబంధం లేదు. అడ్వర్టైజ్ మెంట్స్‌పై స్పందించే ముందు క్షుణ్ణంగా విచారించుకోండి. ఈ పత్రికకు ఏ విధమైన సంబంధంలేదు.

క్రైస్తవనాడు విస్తరించేందుకు చందాలు పంపి సహకరించండి.మీ అనుదిన కుటుంబ ప్రార్థనల్లో గుర్తుచేసుకొండి. మీ స్నేహితులకు పరిచయం చేసి ప్రోత్సహించండి.

CHRISTAVANAADU ON LINE A/C Current Account No. : 13 96 111 00 00 00 52
Andhra Bank, Adarsh Nagar Branch, Visakha-530 040.

సం॥ చందా రూ. 200/-లు. చందాదారులకు పెళ్లి, పుట్టినరోజు, స్మారక ప్రకటనలు ఉచితం! చందాదారులకు మాత్రమే రెగ్యులర్‌గా పంపబడుతుంది. పత్రిక అందని చందాదారులు ఉత్తరాల ద్వారా మాత్రమే ఆ సంగతి మాకు తెలియజేయాలి. లేకుంటే మేం భాద్యత వహించలేం. పాఠకులిది గమనించి సహకరించగలరు. -ఎడిటర్. సంప్రదించండి : 9490266640, 9346960601.

# దేవుని జ్ఞానం - మానవ విజ్ఞానం 70

బైబిల్ / దేవుని మాట × సైన్స్ / శాస్త్రజ్ఞుల మాట

"క్రైస్తవనాడు" ద్వారా అనేకులకు మేలు కలుగుటకై విజ్ఞాన విషయాలను అనగా నేటి వరకూ సైన్స్ సాధించిన ప్రగతిని గూర్చి వివరిస్తూ, ఆ ప్రగతి అంతయు దేవుని అనంత జ్ఞానంలో కొంతమాత్రమే అని తెలలియజేప్పుటకు చేయు ప్రయత్నమే ఈ "దేవుని జ్ఞానం - మానవ విజ్ఞానం " శీర్షిక ముఖ్యోద్దేశము.



- వై.ఎల్. రవిరాజు

భూమ్మీద ఉన్న ప్రతి మనిషి తాను పుట్టిన తరువాత ఎదిగే క్రమంలో అనేక మార్పులకు లోనౌతున్నారని మనకు తెలుసు. అనగా.... ప్రతి మనిషికి రాత్రి 10 గంటలు దాటితే సాధారణంగా కళ్లు మూతలుపడుతుంటాయి. అలాగే తెల్లవారితే ఎవరూ లేపకపోయిన మనకు మెలకువ వచ్చేస్తుంది. అలాగే మనం యౌవ్వనంలోకి అడుగిడుచుండగా శరీరం అనేక మార్పులకు లోనగుట చూడగలరు. అలాగే వయస్సు పెరుగుతున్నకొలది వృద్ధాప్యం అనేది ప్రారంభమౌతుంది. తరువాత మరణంతో ఈ లోకంలో మన జీవనయాత్ర ముగుస్తుంది. ఇది ఆలోచించు అందరికి అవగాహన అవుతుంది. అనేకులు ఆలోచించని సంగతులను గురించి మనల్ని ఆలోచింపజేస్తున్న గ్రంథం బైబిలన్నది మనకు తెలుసు. మన ఆలోచనలవల్ల ఉత్పన్నమైయ్యే ప్రశ్నలలో కొన్ని... జీవిస్తున్న కాలంలో శరీరంలో ఇన్ని మార్పులు ఎందుకువస్తున్నాయి? అలా రావటానికి గల కారణం ఏంటి? అంతెందుకు పుట్టినప్పుడు మన రూపం ఒకలా , పెరుగుతున్న కొలదీ మన రూపం మరోలా మారుతుండుట చూస్తుంటాం. పుట్టినప్పుడు ఉన్న రూపం యౌవ్వనంలో ఉండదు. యౌవ్వనంలో ఉన్న రూపం వృద్ధాప్యంలో ఉండదు. దానిక్కారణమేంటి?

మనం ఒకసారి ఆలోచించగలిగితే మన శరీరంలో కాలం అనేది ఒక యంత్రంలా పనిచేస్తుందని, కాలగమనం మనలను శాసిస్తుందని అర్థమౌతుంది. అందుకే కాలం చాలా విలువైనదని అంటుంటారు. పగటిపూట ఉన్నట్లు రాత్రులు ఉండలేము, రాత్రులు ఉన్నట్లు రేపు ఉండలేము. ఏ రోజుకారోజు కొత్త జీవితం. నిన్న జీవితాన్ని వెనుకకు తేలేము. రేపటి జీవితాన్ని ఊహించలేము. ఇది జగమెరిగిన సత్యం. దీన్ని ఎవరూ కాదనలేరు. జీవితాల్లోనే కాదుగాని యావత్తు ప్రకృతి చక్రం కూడా కాలం మీదే ఆధారపడిఉంది. ఎందుకంటే కాలం అనేది దేవునిది. కాబట్టే బైబిలు ఇలా చెబుతుంది...

**★ కాలములను సమయములను తండ్రి తన స్వాధీనమందుంచుకొని యున్నాడు.**

చదివారు కదా దేవుని మాట. కాలాలు సమయాలు ఆయన స్వాధీనములో ఉన్నాయి. అందుకే ఏ కాలంలో జరిగేవి ఆ కాలంలో జరుగుతున్నాయి. సూర్యునికి నిర్దేశించిన సమయానికి వస్తాడు, వెళ్తాడు. సూర్యుడు రాకపోతే మనకు వెలుగు అన్నదే ఉండదని బైబిలు చెబుతుంది, దీన్ని శాస్త్రవేత్తలు కూడా ఒప్పుకుంటున్నారు. తద్వారా అందరూ నమ్ముతున్నారు.

**★ భూమిమీద వెలుగిచ్చుటకు 'అవి' (సూర్యచంద్ర నక్షత్రాలు) ఆకాశ విశాలమందు జ్యోతులైయుండు గాకనియు పలికెను.**

కేవలం భూమ్మీద వెలుగిచ్చుటకు మాత్రమే సూర్యున్ని సృజించినట్లు దేవుడు వ్రాయించారు. దీన్ని బట్టైనా దేవుడు కాలాలను సమయాలను ఆయన స్వాధీనంలో ఉంచుకున్నారని తేటతెల్లమౌతుంది. కాబట్టే సూర్యుడు తన సమయానికి వస్తున్నాడు. దేవుడు ఏర్పరిచిన కట్టడను సూర్యుడే కాదుగాని ప్రకృతిలో ఉన్న ప్రతి వస్తువు దాటడం లేదు. మరి దేవుడు కాలాలను బట్టే మనుష్య శరీరంలో మార్పులను పెట్టారు. అంటే పుట్టిన ప్రతి మనిషి (దేవున్ని నమ్మిన వారైనా, నమ్మని వారైనా) దేవుని చేతిలో ఉన్నారని మనం అర్థం చేసుకోవాలి. కాదంటారా! అవుననే అంటుంది బైబిలు.

**★ నా కాలగతులు నీ వశములో నున్నవి.**

పుట్టకముందు నుండి దేవుని ప్రణాళిక ప్రకారం తల్లి గర్భంలోకి ప్రవేశిస్తున్నాం. తల్లి గర్భంలో 9 నెలలు అతి జాగ్రత్తగా దేవుడు మనల్ని సంరక్షిస్తున్నారు. అలాగే పుట్టిన తరువాత జీవితంలో జరిగే మార్పులు కూడా దేవుని చిత్త ప్రకారమే జరుగుతున్నాయి. కాని అనేకుల జీవనం మాత్రం దేవునికి దూరంగానే ఉందని నేటి సమాజాన్ని చూస్తుంటే అర్థమౌతుంది. క్రైస్తవుల్లోనే అనేకులు దేవుని చిత్త ప్రకారం జీవిస్తున్నామని చెప్పుకుంటున్నారే గాని వారి ఇష్టప్రకారం (దేవుని ఇష్టం కాదు) జరిగించుటకు వేగిరపడుతున్నారు. ఇది ఎంతవరకు సమంజసం? ఒకసారి ఆలోచించండి.

గమనిక: మునుపటి సంచికల్లో గల కొన్ని శీర్షికలు అనేక మంది పాఠకుల కోరికపై మరలా వీలును బట్టి ఇస్తున్నాం. అందువల్ల కొన్ని రిపీట్ అవుతున్నాయి గమనించగలరు.

★ ముందు జరిగినదే ఇప్పుడును జరుగును; జరుగబోవునది పూర్వమందు జరిగినదే; జరిగిపోయినదానిని దేవుడు మరల రప్పించును

వై.కనకరాజు, వై.ఎల్. రవిరాజులు వ్రాస్తున్న ప్రతి వివరణ అప్పటికి తగినంతమాత్రమే. సంచలనాత్మక విషయాలు, త్వరలో అని ప్రకటించినవి వీలును బట్టి ప్రచురిస్తాం! పాఠకులిది గమనించగలరు. అందుకై తదుపరి సంచికలు ఫాలో అవ్వండి.

# క్రైస్తవనాడు విజయానికి కారణాలనేకం!

(గత సంచిక తరువాయి....)

నా స్నేహితులైనా, బంధువులైనా, తుదకు క్రీస్తు నందు సహోదరులైనా మా ఇంటికొచ్చినా లేక బయట ఎదురైనా మా ఆతిధ్యం స్వీకరించని వారు లేరు. వారు ఒక్కోసారి మాకు పోటీ వ్యాపారం చేసినా, మమ్మల్ని ద్వేషించినా మా ఆతిధ్యం ఇవ్వడం మానలేదు, మానలేము. అట్టి ఆదరణ నాటి దినాల్లో నుండే మాలో ఉన్నా... క్రీస్తునెరిగిన తర్వాత దినాల్లో దిన దినం మరెక్కువగా మా జీవితాల్లో ప్రభలుతుంది. మమ్మల్ని అలా దినదినం తన ప్రేమా పరిచర్యల్లో విస్తరింపజేస్తూ.... వర్థిల్లజేస్తున్న ' దేవునికి స్తోత్రము '. క్రీస్తు సేవా పరిచర్యల్లో భాగంగా తిరుగుతున్న నన్ను, నాభార్యను చూసి అనేక సోదరులు ఇచ్చిన, ఇస్తున్న సాక్ష్యం - కనకరాజుగారు! మీ భార్యాభర్తలు జంటగా ఎప్పుడూ తిరుగుతూ కన్పడుతుంటే మాకెంతో ఆనందంగా ఉంటుందండి అంటుంటారు. ఇలా జంటగా సేవలో తిరుగుతున్న వారు బహు అరుదండి అంటారు. మీరు ఎప్పుడు సాధారణంగా మాకు ఒంటరిగా కన్పడరండి! అలా మేమూ జంటగా తిరగాలనుకున్నా మాకవట్లేదండి అని కూడా అంటుంటారు. వారి మాటలను బట్టి మాకు అట్టి ధన్యతనిచ్చిన దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లిస్తూంటాం. మీ అందరి ప్రార్థనా సహకారాలు కూడా మా ఆశీర్వాదానికి, ఉన్నంతలోనే మేము అక్కరలు గల ఇతరులకు సహకరించేందుకు కారణమని మాకు తెలుసు. మా కుటుంబం కోసం మీ కుటుంబ ప్రార్థనల్లో మరింత గుర్తుంచుకోమనవి.

## ఏది మన దేశానికిప్పుడు అవసరం?

# నాగరికతా? సౌవార్తీకరణా?



బ్రదర్ ఎం. ఎ. పాల్ పాస్టర్

అత్యంత అద్భుతమైన నామమైన నా ప్రభువైన యేసుక్రీస్తు నామములో మీకు శుభములు తెలియజేయుచున్నాను.

అమితంగా పెరిగిపోవుచున్న జనాభాకు తగినట్లుగా సౌవార్తీకరణ చేయుటలో సంఘము వైఫల్యత చెందింది.

అధిక జనాభా కలిగిన దేశాలలో మన దేశం ఒకటి. మన దేశ ప్రజల అవసరతలను తీర్చుట అనేటటువంటి ఒక గొప్ప సవాలు మనముందున్నది. సాంకేతిక పరిజ్ఞానములోను, విద్యారంగములోను, వైద్యపరంగాను కూడా మన దేశం ఉన్నత శిఖరాలను చేరుకుంది. ఇతర దేశాల వారు కూడా మన దేశ ప్రజలను వారి దేశ అవసరతలకోసం ఆయా రంగాలలో ఉన్నవారిని వాడుకుంటున్నారు. అయితే ఆత్మీయ ఎదుగుదలలో చూస్తే ఇటువంటి ఉన్నతమైన స్థానాలలోనికి వెళ్ళలేకపోతున్నారు. ఇటువంటి ఉన్నత స్థానాలలో ఉండవలసిన వారు చాలా మంది నైతిక విలువలే లేని భయంకరమైన సమాజంలో దిగజారిపోయిన స్థితిలోనున్నారు. మానవుడు శారీరకంగా, సమాజపరంగా, మానసికంగా, ఆత్మీయంగా పతనమవడానికి లేదా దిగజారిపోవడానికి గల కారణం నైతిక విలువలను మరచి అన్యాయము నాశ్రయించి జీవించడమే. ఎక్కడ చూసిన పాపము ప్రతిచోట ఉనికిని కలిగియున్నది. పాపము మానవత్వంపైన ప్రభుత్వం చేస్తుంది. మనుష్యులు అనేక రంగాలలో అన్యాయస్తులుగాను, అక్రమము చేయువారిగాను మారిపోతున్నారు. మతముగాని, విద్యగాని భూమి మీద నివసిస్తున్న ఏ ఒక్క మనుష్యుని జీవితంపై మార్పు తెచ్చే విషయంలో ఎటువంటి ప్రభావాన్ని చూపడంలో విఫలమైపోయాయి. వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా, సమాజపరంగా, ఆత్మీయ జీవితంలో మనముండవలసిన స్థితిలో లేమని ప్రప్రథమంగా మనము గుర్తించ బద్ధులమైయున్నాము. మనుష్యులలో అనేకమంది వారి జీవితాలలో ప్రాముఖ్యతను దేనికివ్వాలో గుర్తించలేక అలక్ష్యం చేస్తున్నారు. ఈ కారణంగా సమాజంలోనే కాదు సంఘములో సహితం నిరాశ చెందిన వారు, ఓడిపోయినవారు, కృంగిపోయిన వారుగా ఉన్నారు.

విద్య మరియు మత సంబంధిత సంస్థలలో కూడా ప్రయోజనం లేని నాయకత్వము కారణంగా ఈనాడు మనదేశం అనేకమైన సమస్యలకు నిలయంగా మారింది. అనేక సమస్యలనెదుర్కొంటుంది. ఉన్నతమైన స్థానాలలో అనర్హమైన వ్యక్తులు ఉండటాన్ని గుర్తించిన యువతరం ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. నైతికవిలువలనేవి పూర్తిగా దిగజారిపోయినట్లే. ప్రస్తుత దినాలలో వైఫల్యాలన్నిటికీ మించిన వైఫల్యత ఏమంటే దేవుని సంఘము మతాచారాలకు, మానవ ఆజ్ఞలకు ప్రాధాన్యత నివ్వడం.

(వచ్చే సంచికలో....)

## ఎవరైనా మీ బైబిలు లో తప్పులున్నాయంటే... తగు జవాబులతో వివరించి ఒప్పించాలి. అంతేగాని మీ గ్రంథాల్లోనూ తప్పులున్నాయనుట భ్రష్టత్వానికి పరాకాష్ట!

మన కుటుంబీకుల ప్రవర్తనల్లో ఎవరైనా పొరబాట్లున్నట్లు భావించి మనకు తెలిపితే అవి సద్విమర్శలుగా స్వీకరించాలి. అందుకు తగ్గ వివరణతో ఆయా ప్రవర్తనల్లో చెడు లేకుంటే లేదని చెప్పాలి. వారు అపోహపడ్డారని నిరూపించగలగాలి. అది సంస్కారుల లక్షణం. అంతేగాని వారిని పట్టుకొని మీలోను, మీ కుటుంబీకుల్లోను అంతకు మించిన పొరబాట్లున్నాయి అని ఎదురు చెప్పుట కుసంస్కారం. వారికి అది కోపోద్రేకాన్ని కల్గిస్తుందేగాని మనయెడల సద్భావం కల్గించదన్నది ఎరుగుటయే విజ్ఞుల లక్షణం. మనల్ని ప్రశ్నించిన ఎదుటివారిని చిరునవ్వుతో పలుకరించి మన కుటుంబ సాక్ష్యాన్ని నిరూపించుకొనుటే శ్రేయస్కరం. నిరూపించుటకు మన సాక్ష్యం లోకంలో బాగుండాలి. ఎప్పుడూ అలా ఆలోచించండి! బైబిల్లో తప్పులున్నాయంటే వారు ప్రశ్నించే వాటిని విని తగు వివరణ ఇవ్వాలి. బైబిల్లో వ్రాయబడి ప్రపంచానికి తెలియబడుతున్న తండ్రియైన దేవునిలోను, మన ప్రభువైన యేసుక్రీస్తులోను ఎటువంటి తప్పులు లేవుగా! వారి మహోన్నతత్వం వివరించుటకు సంకోచమెందుకు? బైబిలు చదువని వారికి, చదివింది గ్రహించని వారికి అన్నీ సంకోచాలే. కాబట్టి వారు చెప్పలేరు. క్రైస్తవనాడు పాఠకులు అలా కారాదనే మా ఆకాంక్ష. అందుకోసమే బైబిల్లో గల అనేక సంగతులను వివరించుటకై క్రైస్తవనాడు మొదట్నుంచీ బహు సంతోషంతో సంకల్పించింది. ఆ సంకల్పాన్ని సంపూర్ణంగా నెరవేర్చుకోవాలంటే యేసు దగ్గరకే వెళ్లాలని మత్తయి 11:28లో చూడగలం. అందుకే ప్రతి ప్రశ్నకు యేసు (వాక్యం) నొద్దకు క్రైస్తవనాడు వెళ్తుంది. 'నా దగ్గరకు వచ్చి నేర్చుకొనుడి' అని యేసుక్రీస్తువారే అభయమిచ్చారు. బైబిలు చదువుతూ ధ్యానిస్తుండగా గ్రహింపును ఇచ్చేది ఆయనే. అది మా యెడలనూ నెరవేరుస్తున్న 'దేవునికి స్తోత్రము'.

# దేవుని వాక్యపు శక్తి



బ్రదర్ జె. ఫిలిప్

*(గత సంచిక తరువాయి....)*

సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడనుకాను. ఏలయనగా నమ్ము ప్రతివానికి, మొదట యూదునికి, గ్రీసు దేశస్థునికి కూడ రక్షణ కలుగజేయుటకు అది దేవుని శక్తియైయున్నది - రోమ 1:16

'నమ్ముప్రతివానికి రక్షణ కలగజేయుటకు సువార్త దేవుని శక్తియై యున్నది'

**2.పాపముతో పోరాడును :** యౌవనస్థులు దేని చేత తమ నడత శుద్ధి పరచుకొందురు? నీ వాక్యమును బట్టి దానిని జాగ్రత్తగా చూచుకొనుట చేతనేగదా? నాపూర్ణ హృదయముతో నిన్ను వెదకియున్నాను, నన్ను నీ ఆజ్ఞలను విడిచి తిరుగనియ్యకుము. నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొని యున్నాను. - కీర్త 119:9-11

దేవుని వాక్యమును ఎరిగి విధేయత చూపినప్పుడు మనము సత్యమనే వెలుగులో పాపమును చూడగలము మరియు పాపము చేయుట వలన కలుగు ఫలితములు గురించి హెచ్చరించబడుదుము.

**3.ఆత్మీయ ఎదుగుదలను కలుగజేయును:** ప్రభువు దయాళుడని మీరు రుచిచూచియున్న యెడల సమస్తమైన దుష్టత్వమును, సమస్తమైన కపటమును, వేషధారణను, అసూయను, సమస్తదూషణ మాటలను మాని, క్రొత్తగా జన్మించిన శిశువులను పోలినవారై, నిర్మలమైన వాక్యమను పాల వలన రక్షణ విషయములో ఎదుగునిమిత్తము ఆపాలను అపేక్షించుడి.

పాలు త్రాగుట వలన శారీరక ఎదుగుదల ఏలాగు కలుగుతుందో అలాగే దేవుని వాక్యాన్ని అర్థము చేసుకొని విధేయులమైనప్పుడు, ఆత్మీయ ఎదుగుదల కలుగుతుంది.

ఆత్మయే జీవింపచేయుచున్నది, శరీరము కేవలము నిష్ప్రయోజనము. నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు జీవమునై యున్నవి - యోహాను 6:63

దేవుని వాక్యము ఆత్మకు ఆహారము గనుక దానిని ఆరగించి బలము పొందుము.

**4. మన నిజమైన ఉద్దేశ్యములను స్వచ్ఛంగా కనబరుస్తుంది :** ఎందుకనగా దేవుని వాక్యము సజీవమై బలముగలదై రెండంచులుగల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను కీళ్ళను మూలుగను విభజించునంతమట్టుకు దూరుచు, హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించుచున్నది - హెబ్రి 4:12

మనము కొన్ని సార్లు గమనించలేనటువంటి అంతరంగిక, నిజమైన అభిప్రాయమును కనుపరచేశక్తి దేవుని వాక్యమునకు కలదు.

**5. క్రీస్తు పోలికకు అనుగుణంగా మనలను మార్చుతుంది :** మీరు వినువారు మాత్రమైయుండి మిమ్మును మీరు మోసపుచ్చుకొనకుండ, వాక్యప్రకారము ప్రవర్తించు వారునై యుండుడి. ఎవడైనను వాక్యమును వినువాడైయుండి దాని ప్రకారము ప్రవర్తింపని వాడైతే, వాడు అద్దములో తన సహజ ముఖమును చూచుకొను మనుష్యుని పోలియున్నాడు. వాడు తన్ను చూచుకొని అవతలికిపోయి తానెట్టివాడో వెంటనే మరచిపోవునుగదా. -యాకోబు 1:22-24

దేవుని వాక్యములోనికి చూచునప్పుడు మనము నిజముగా ఎలా ఉన్నామో చూపే అద్దం వంటిది. దేవుని వాక్యమునకు మరియు పరిశుద్ధ గ్రంథమునకు విధేయత చూపునప్పుడు జీవితంలో ఎటువంటి మార్పులు కలుగునో అది చూపును.

మనమందరమును ముసుకు లేని ముఖముతో ప్రభువుయొక్క మహిమను అద్దమువలె ప్రతిఫలింపజేయుచు, మహిమనుండి అధికమహిమను పొందుచు ప్రభువగు ఆత్మచేత ఆ పోలికగానే మార్చబడుచున్నాము. -2 కొరింథి 3:18

దేవుని వాక్యమునకు అనుగుణముగా మనము విధేయత చూపినప్పుడు మన బుద్ధిలో, నడతలో, మాటలో క్రీస్తు పోలికకు ఇంకా దగ్గరగా మార్చబడతాము.

**పరిశుద్ధ బైబిల్‌ను పోలిన పుస్తకమును నీ వెన్నడును చదువలేవు, నీ జీవితాన్ని శాశ్వతంగా మార్చగలిగే శక్తిగల పుస్తకము ఇది ఒక్కటి మాత్రమే**

# మా సంఘానికి రండి!



(గత సంచిక తరువాయి.....)

క్రైస్తవేతరులు క్రీస్తును గురించి మరిన్ని వివరాలు అడిగితే వాటికి జవాబులిస్తూ క్రీస్తు కొరకు వారిని మలచాలి. అందుకు ఎంతో ఓర్పు, సహనం కావాలి. ఇలా అందరూ యేసుని ఎరిగేట్లు చేయాలి. అందుకు మనందరిలో ముందుగా దేవుని ప్రేమ నింపుకొంటుండాలి. ఆ ప్రేమే మనల్ని ఇతరుల వైపు నడుపుతుంది. మన మాటలు విన్న వారిని ఆలోచింపజేస్తుంది. తద్వారా వారూ ఓ నాటికి క్రైస్తవులైయేందుకు అవకాశముంటుంది. అందుకు మనం చేయాల్సిందల్లా వారి హృదయాల్లోనికి క్రీస్తు వాక్యమనే విత్తనాన్ని నాటాలి. తగిన సమయమందు దేవుడే ఆ విత్తనం ఫలించునట్లు చేయగలరు. ఆ విత్తనానికి తగిన శరీరాన్ని దేవుడే ఇస్తారని కూడా వాక్యం మనకు బోధిస్తుంది. అలా చేస్తున్న వారే క్రైస్తవులు... క్రీస్తు శిష్యులు. వారందరూ మహిమ పర్చబడి మహిమనుండి అధిక మహిమకు పాత్రులుగా లోకంలో కన్పడతారు. అందుక్కారణం.. వారు యేసు చెప్పింది విని, గ్రహించి, ఆచరించారు గనుక. క్రైస్తవులైన వారందరిపైనా ప్రభువు అట్టి బాధ్యతనుంచారు. ఆయన కాడి సుళువు. ప్రియులారా! మీరు మోస్తున్నారా? లేదా? ఈ లోకంలో జీవించి ఉండగానే ఆయన చెప్పిన పని చేయాలి. తద్వారా అనేకులను రక్షణ మార్గానికి నడిపించాలి. ' యేసుని నమ్మటంటే మతం, జాతి, కులం మారుట కాదని కేవలం మీ మనస్సు మారుటేనని ఘంటాపథంగా చెప్పగలగాలి'. దేవుడు మనల్ని నమ్మి అప్పగించిన బాధ్యత ఇదే సుమా!

సేవకులారా! యేసు మాట ప్రకారం క్రైస్తవేతరులకు సువార్త ప్రకటించుట మాని, మీ బోటి సేవకుని దగ్గర యేసుని ఎరుగుచున్న క్రైస్తవుల దగ్గరకు వెళ్ళుట ఎంత వరకు సమంజసం. ఒక వేళ వెళ్లినా మా



## చాకిరేవు

-ఎడిటర్



సంఘానికి రండి అన్న దౌర్భాగ్యపు పలుకులు పలుకకండి. మీకై మీరు ఆత్మలను రక్షించుటకు ప్రయాసపడండి. అలా ప్రయాసపడితే వారు దేవునిచే ఆకర్షింపబడి క్రీస్తును ఎరుగుతారు. ఎవరైనా నీవు నడుపుతున్న సంఘమనే స్థలానికి వచ్చి, నీ దగ్గర ఉన్న క్రైస్తవుల్లో ఎందరిని ' నీవు ' ప్రభువు దగ్గరకు నడిపించావు అని ప్రశ్నిస్తే ఏం జవాబు చెప్తావు? ఎవ్వరూ లేరు బ్రదర్! అందరూ వేరే స్థలాల్లో, వేరే సేవకులదగ్గర కెళ్తున్నవారే. ఇప్పుడు నా దగ్గరకొచ్చారు అంటావా? ఆలోచించు. నేను సువార్త ప్రకటించి ఈ కుటుంబాన్ని ప్రభువు చెంతకు నడిపించాను. అంతకు ముందు వీరికి యేసంటేనే తెలియదు అన్న ఘనమైన సాక్ష్యము కలిగున్నావా? ఇప్పటికీ నీ జీవితంలో అటువంటి సాక్ష్యం లేకుంటే ఇప్పటినుంచైనా ప్రయత్నించు. వేలాది ఆత్మలను నిన్నొక్కడినే దేవుడు రక్షణలోకి నడిపించమన్లేదు! ఈ లోకంలో ఒక్క ఆత్మ మారితే చాలట. పరలోకంలో దేవుడు సంతోషిస్తారట. ఇదెంతో వింతగా అన్పిస్తుందా? అయితే ఈ వివరణ నీ కోసమే... ఈ లోకంలో సుమారు 800 కోట్లమంది జనాభా అనుకో! అందు సుమారు 400 కోట్లమంది క్రైస్తవులున్నారనుకో! ఒక్కరు మరొకరి మార్పునకు దేవుని చేతిలో సాధనంగా వాడబడితే అందరూ క్రైస్తవులయ్యేవారే కదా! ఆలోచించు. అదెప్పటికి జరిగెనో?! ఇప్పటికైనా సేవకులు సువార్త చేసేందుకు క్రైస్తవేతరుల దగ్గరకెళ్తేచాలు. తగిన సహాయం దేవుడే చేసి వాక్యం విన్న అందరినీ యేసుక్రీస్తు దగ్గరకు ఆకర్షించగలరు. అదిప్పుడే జరగాలని నా ఆకాంక్ష కూడా! ప్రియ సేవకులూ మీరేమంటారు?

ప్రియకాపరీ... నీ సాటి కాపరికి దేవునిచే అప్పగించబడిన దేవుని పిల్లల (క్రైస్తవుల) యొద్దకు వెళ్లకుంటే మేలు! క్రైస్తవేతరుల యొద్దకెళ్లి 'సువార్త ' చేయుు. లేని యెడల నీవు చేసినట్లే నీకు చేయబడుతుంది. తద్వారా కాపర్లమధ్య ద్వేషం పెరుగుతుంది. ఐక్యత లోపిస్తుంది. ఇది ఇప్పటికే అనేక చోట్ల కన్పడుతుంది. పైకి మీరు ఒకరియందొకరు ఐక్యతను కన్పింపజేసినా లోపలున్న ద్వేషాగ్ని మిమ్మల్ని దహించేస్తుంది. మీలో ఐక్యత లేకుండుటకు కారణం పైన నేను చెప్పిన కారణాలు కొన్నే సుమా! 'ప్రేమైక్యతలు లేని వారు దేవుని మహిమ పరచలేరు. సేవాపరిచర్యలకు పనికిరావు '. మీకు దగ్గరగానున్న కాపర్లందరితో సఖ్యతగా ఉండండి. సువార్తను ఐక్యంగా కలిసి మెలసి ప్రకటించండి. ఇది దేవుని చిత్తం. ఆచరించి ఆశీర్వదింపబడండి.

**జీవితాంతం లేనోళ్లేనా?!**
**వచ్చే సంచికలో...**

ఇప్పుడు వెబ్‌సైట్‌లో...
మన క్రైస్తవనాడు
www.christavanaadu.com

## ప్రేమోన్మాది సేకరణల్లో పేపర్ కటింగ్‌లు, సిడీలు!

ఈ మధ్యే ఆదిలాబాద్ జిల్లా మంచిర్యాల మండలంలో ఇద్దరు యువతుల గొంతుకలు కోసిన ప్రేమోన్మాది ఉదంతం మీకు తెలుసు. ఆ ప్రేమోన్మాది ఇంట్లో.... ప్రేమోన్మాదులు చేసిన సంఘటనలకు సంబంధించిన పత్రికల కటింగులు, సిడీలు లభ్యమైయ్యాయి. వాటిని చదివి లేక చూచిన తర్వాత కూడా ఆ ప్రేమోన్మాదిలో మార్పురాలేదంటే దానిక్కారణం? ఆలోచించాలి. కాబట్టి ఎవరైనా రాసిన వార్తలు, చూపిన దృశ్యాలు ఏ విధంగా ఉంటే మంచిదో ఎవరికి వారే స్వయం నియంత్రణ అలవర్చుకోవడం మీడియాకు మంచిదంటున్నారు. ఇది ఎందరో తల్లిదండ్రుల మనోవేదన. ఆ తల్లిదండ్రుల్లోనే మనము ఉన్నామని మీడియా వారిని కోరుతున్న వారెందరో!

లోకుల / విశ్వాసుల మాట....

**అవునా? కాదా?**

## పేరుకే గొప్పోళ్లు!

**అనేకుల బోధల్లో దేవుని పిల్లలమని, రాజులమని, యాజకులమని ఇంకా అనేక రకాలుగా గొప్పోళ్లమని చెప్తుంటారు. కానీ వారి బ్రతుకుల్లో అందుకు తగ్గ విలువలను కన్పరచరు. నోరు విప్పితే చాలు బీద అరుపులే. సహకారం చేసే వాళ్ల దగ్గరైతే మరీను. మీరు సహకరించకపోతే మాకు బ్రతుకే లేదంటారు. మొత్తానికి ఎలాగోలా వారిని బుట్టలో పడేసి తమ పబ్బం గడుపుకుంటారు. దేవునిలో అలాంటి వారు దౌర్భాగ్యులే. మీరా లిస్టులో ఉన్నారేమో సరిచూసుకోండి. అట్టివారు పేరుకే గొప్పోళ్లు! దేవుని దృష్టిలో నిరంతరం ముష్టోళ్లే!**

విజయనగరంలో త్వరలో ప్రారంభం!

**బైబిల్ బుక్ హౌస్ & స్టేషనరీ**



మా వద్ద అన్నిరకముల బైబిల్లు, బైబిలుకు సంబంధించిన పుస్తకములు, సిడీలు, డివిడీలు మరియు నోట్సు పుస్తకములు లభించును

10-1-30, కొత్తపేట, గౌడ్ వీధి, విజయనగరం-535001

ఫోన్ : 08922-220227

Nanajee CELL : 9885606097




Flex Banners Front light flex Back light flex Vinyl Publicity boards

Specialist in

Publicity Balloons Funny Costumer Inflatables

27-18-92, Ganesh Complex, 1st Floor, Congress Office Road, Near Hotel Nataraj Complex, Governorpet, Vijayawada- 520002. E-Mail : nanaji_ads@Yahoo.co.in


## బైబిలుపై సందేహాలు, ప్రశ్నలు - జవాబులు

★ అజ్ఞానముగా మాటలాడు మూర్ఖుల నోరు మూయించుటే దేవుని చిత్తం.

*ప్రభువునందు ప్రియులకు!*

చాన్నాళ్ల నుండే పై విషయంలో అనేక తర్జన భర్జనలు జరుగుతున్నాయి. అది మనలో అత్యధిలకు తెలిసిన సంగతే.అయితే కొన్ని సార్లు ఆయా ప్రశ్నలవల్ల విశ్వాసుల్లో అనేకులకు దేవుని యెడల అనుమానం వస్తుండుట సహజం. కొందరిలోనైతే విశ్వాసమే సడలిపోవుటకు ఆస్కారమేర్పడుతుందని వింటుంటాం. కొందరు క్రైస్తవులు కూడా ఇట్టి వాటివల్ల ముస్లింలుగా మారిన వైనం అక్కడక్కడ చూడగలం.అందుకనేక కారణాలుండొచ్చు గాని ప్రథమ కారణంగా వారు ఆయా ప్రశ్నల్నే చూపెడుతుంటారు.వాటికి జవాబులు దొరక్కే సత్యం కోసం ఆలోచించే మేము బైబిలును విడిచామంటూ చెప్పుకొస్తుంటారు. ఇటువంటి వెన్నో మా దృష్టికొచ్చాయి, వాటికి ఫుల్‌స్టాప్ పెట్టాలన్న నిర్ణయానికి క్రైస్తవనాడు వచ్చింది.ఇదే ఆలోచన కలిగిన వారిలో క్రైస్తవనాడు ఓ భాగమైంది. ప్రతి ప్రశ్నకు లేఖనాను కూలంగా జవాబులిస్తూ అందర్నీ ఆయత్తపర్చడమే క్రైస్తవనాడు ముఖ్యోద్దేశం. ఈ జవాబులు క్రైస్తవులందరికి చేరాలంటే ఒక్క క్రైస్తవనాడుకే సాధ్యం కాకపోవచ్చు, కాబట్టి చదివిన వారందరూ ఆయా జవాబులను ఇతర క్రైస్తవులతోను, ప్రశ్నించే క్రైస్తవేతరులతోను పంచుకోండి. తద్వారా అట్టి ప్రశ్నలు మరెవ్వరూ వేయకుండునట్లు చేయగలం. రండి! మరెందుకాలశ్యం? మనం కూడి బైబిలు ఔన్నత్యాన్ని లోకానికి చాటుదాం. మన తండ్రియైన దేవునిని, మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు వారిని అందరిలో మహిమ పరుద్దాం. తద్వారా మనం మహిమపరచబడదాం.

## ప్రశ్న : యేసుక్రీస్తు సాధారణ ప్రవక్తా?



(గత సంచిక తరువాయి....)

అందును బట్టియే మనం బైబిలు చదువుతూ దేవునిని, ఆయన కుమారుడైన యేసుక్రీస్తును ఎరుగుతున్నాం. బైబిలు యేసుని దేవుని కుమారుడంటుంది. మనం అది నమ్మాలి, నమ్ముతున్నాం కూడా. యేసు పలికిన మాటగా 'ప్రవక్తకంటే గొప్పవాడు ఇక్కడున్నాడని' వ్రాయబడింది. ఆయనే స్వయంగా పలికినప్పటి ఆ సందర్భాన్ని బైబిల్లో చూడగలం.అందును బట్టి మనం ఆయన్ను ప్రవక్తకంటే గొప్పవాడని నమ్ముతున్నాం. అంతేగాక వ్రాయబడి మనకప్పగించబడిన వాటిని బట్టి సొలొమోను మహారాజు కంటే ఆయన గొప్పవాడని నమ్ముతున్నాం. దేవాలయము కంటే గొప్పవాడిక్కడ ఉన్నాడన్న యేసు మాటను బట్టి ఆయన్ను దేవాలయము కంటే గొప్పవాడని నమ్ముతున్నాం. ఇందుకు విరుద్ధంగా ఎవరైనా వాదించినా, వివాదానికి ప్రయత్నించినా అది మతభేదములను పుట్టించి గలిబిలికి దారి తీస్తుంది. ఒక వేళ వాటిని తెల్సుకొనుటకే మేమలా అన్నాం అని వారంటే వారు బైబిలును బట్టియే ప్రశ్నించాలి. బైబిల్లోనైనా, మరే గ్రంథాల్లోనైనా లేక ఎవరైనా వ్రాసిన పుస్తకాలలోనున్నవైనా అసంబద్ధంగా ఎవరికైనా కన్పడితే ప్రశ్నించొచ్చు. తగిన జవాబు వారు ఆయా రచనలబట్టే ఇస్తారు. వారిచ్చిన వివరణలు ఆయా గ్రంథాల్లో ఉన్న మిగిలిన వాటితో సరిపోయాయో లేదోనని పరీక్షించొచ్చు. ఆ జవాబులను వారికి భిన్నమైన తమ గ్రంథాల్లోనున్న వాటితో సరిపోల్చకూడదన్న కనీస అవగాహన కలిగుండాలి. ముస్లింలైనా, క్రైస్తవేతరులైనా యేసుని గురించి అడిగిన ప్రశ్నలు బైబిలును బట్టియేనన్నది ఎక్కువగా వింటుంటాం. కాబట్టి ఆయా ప్రశ్నలకు సరియైన విధంగా సమాధానాలు మనం బైబిలును బట్టి ఇస్తే చాలు! <u>ఉదా : నా కుమారుడు మంచివాడని నేను చెప్పింది నిరూపించుటకు ప్రక్కింటి నా స్నేహితుని కుమారుడు చెడ్డవాడని, మరింకేదోయని నేను చెప్పాల్సిన అవసరం లేదు. అందుకై నేను నా స్నేహితుని కుమారుని రోజుల తరబడి వెంటాడి వాడిలోని లోటుపాట్లను గమనించాల్సిన అవసరం అంతకంటే లేదు. నేనలా చేస్తే నా స్నేహితుడు నన్ను, నా కుమారుడిని ద్వేషిస్తాడే గాని గౌరవించడు. తుదకు మా స్నేహం వీడుతుంది కూడా.</u> అందువల్ల యేసుక్రీస్తుని ప్రకటించేందుకు ఇతరుల గ్రంథాలను పరిశీలించి చదవాల్సిన అవసరం లేదు. అందున్న వారి తప్పొప్పులను ఎత్తి చూపుతూ... మా యేసులో అటువంటి తప్పులు లేవు అని చెప్పుట సమంజసం కాదు. అలా చెప్పినా ఎవరూ నమ్మరు. చెప్పిన వారి అవివేక మాటలను బట్టి తుదకు వారు యేసుక్రీస్తునే ద్వేషించగలరు! జాగ్రత్త సుమా.

**★ ..... నీకు 'అప్పగింపబడిన దానిని కాపాడి ' అపవిత్రమైన వట్టి మాటలకును, జ్ఞానమని 'అబద్ధముగా ' చెప్పబడిన 'విపరీతవాదములకును' దూరముగా ఉండుము. ఆ విషయములో 'ప్రవీణులమని' 'కొందరనుకొని' విశ్వాస విషయము తప్పిపోయిరి.**

*-వైెయార్*

## సిమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చ్ బిల్డింగ్ శతవార్షికోత్సవాల వేడుకలు






బిషప్.డా.కె.ఆర్. సింగ్




రెవ.జోసెఫ్ ప్రకాష్



' సంఘమిత్ర ' ఆర్. ఎస్. జాన్

***<u>జూలై 10 విజయనగరం :</u>*** స్థానిక సిమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చ్ శతవార్షికోత్సవ వేడుకలు ఈ నెల 9,10,11 తేదీల్లో జరిగాయి. ముఖ్య వక్తగా బిషప్ డా.కె.ఆర్.సింగ్, విశాఖపట్నం నుండి విచ్చేసారు. స్థానిక సంఘకాపరి రెవ. జోసఫ్ ప్రకాష్, సంఘనాయకులైన 'సంఘమిత్ర ' ఆర్.ఎస్. జాన్, ఎం.ఎ. నాయుడు వేదికనలంకరించారు. 100 సంవత్సరాలైన సంగతిని, ముఖ్య వక్తయైన బిషప్ డా. కె. ఆర్. సింగ్ పేరుతోను బెలూను ఎగురవేసి విజయనగర చర్చిల్లో ఓ నూతన వరవడికి తెరతీశారు 'సంఘమిత్ర ' ఆర్. ఎస్. జాన్. ఆ విధంగానే మూడు దినాల్లో సభలను ఘనంగానే నిర్వహించారు. బిషప్ డా. కె. ఆర్. సింగ్ తనదైన శైలిలో వాక్యమందించారు. అయితే నూతనంగా చర్చి బిల్డింగ్ నిర్మాణాన్ని గూర్చి రెవ. జోసఫ్ ప్రకాష్ సంఘపెద్దల మాటలలో కొంత తారతమ్యం కన్పించింది. 'సంఘమిత్ర' ఆర్. ఎస్. జాన్. మాట్లాడుతూ.... ఓ నాడు ఈ సంఘంలో బోధించిన కాపరికి నెలకు మూడువేల రూపాయలు జీతం ఇచ్చేందుకు ఎంతో ఇబ్బంది ఉండేది. ఇప్పుడైతే ప్రస్తుత సంఘకాపరి రెవ.జోసెఫ్ ప్రకాష్‌కు 30 వేల రూపాయలు జీతం ఇవ్వగలుగుతున్నాం. ఇది దేవుడు ఈ సంఘం యెడల చేసిన కార్యంగా మేము భావిస్తూ దేవునికి స్తుతులు అర్పిస్తున్నామని చెప్పారు. వక్తలు 'సంఘమిత్ర' ఆర్.ఎస్.జాన్ మరియు వారి కుటుంబం తరాలనుండి ఈ సంఘానికి ఎంతో ఆధరణకరంగా ఉంటూ నేటి ఈ స్థితి వరకు తీసుకువచ్చారని వారి కుటుంబాన్ని గురించి చెప్పారు.





బైబిలుపై అనేకులకున్న సందేహాలను, ప్రశ్నలను
పటాపంచలుగావించే.....దుర్భోధకులకు చెక్ పెట్టే....?!

## 'దేవుని జ్ఞానము చెప్పినదేమనగా'

# దేవునిలో (వాక్యంలో) బలపడితేనే ఆశీర్వాదం

-వైకెయార్

**★ తమ్మును తామే మెచ్చుకొను కొందరితో జతపరచుకొనుటకైనను వారితో సరిచూచు కొనుటకైనను మేము తెగింపజాలము గాని, ' వారు తమలోనే యొకరినిబట్టి యొకరు ఎన్నికచేసికొని యొకరితోనొకరు సరిచూచుకొనుచున్నందున ', గ్రహింపులేక_ యున్నారు.**

దేవునిలో అనగా వాక్యంలో అనేకులు ఎదుగకపోవుటకు కారణం వారు వారికంటే తెలిసిన వారి దగ్గరకు వెళ్లి చర్చించరు. వారిలో వారే తమకు తెల్సిందే గొప్ప విషయంగా పరిగణించి మురిసిపోతూ అతిశయిస్తుంటారు. వారిలో ఎవరో ఒకర్ని పొగడుకొంటూ అల్ప సంతోషులుగా మిగిలిపోతుంటారు. మరింత తెల్సుకొనేందుకు ఎవరినైనా ప్రశ్నించుటకు సంకోచిస్తుంటారు. తమను వారు చిన్న చూపు చూస్తారేమోనన్న సందేహంలో కొట్టుమిట్టాడుతుంటారు. తద్వారా దేవునిలో సంపూర్ణులగుటకు ప్రయత్నించరు. ముందుకు సాగరు. ఎక్కడున్న జీవితాలు అక్కడే ముగిసేటట్లు నిర్వీర్యంగా బ్రతికేస్తుంటారు. ఇలాంటి వారెందర్నో మీరు ఇప్పటికే చూసి ఉండొచ్చు. ఒకవేళ మీరే అట్టి కోవకు చెందినవారైతే వెంటనే మారండి. దేవుని గురించి తెల్సుకొనేందుకు వాక్యాసక్తి కలిగి ఉండండి. మీకంటే వాక్యాన్ని ఎరిగినవారుగా ఎవరైనా కనబడితే ప్రశ్నించండి. వారిచ్చిన జవాబులు లేఖనానుసారంగా ఉన్నవా లేవాయన్నది పరీక్షించండి. లేఖనానుసారంగా ఉంటే వారిని గౌరవించండి. మరిన్ని ప్రశ్నలు వారికి సంధించండి. జవాబులు రాబట్టి దేవునిలో బలపడండి. మీరు ఎరిగింది అవి తెలియని అనేకులకు తెలియబర్చండి. అప్పుడు చూడండి! దేవుడు మిమ్మల్ని ఎంతగా ఆశీర్వదిస్తారో! లోకంలో మనకేది ఉన్నా, లేకున్నా మన మహిమ మనం కలిగియున్న లేఖన బలాన్ని బట్టి అంతకంతకూ విస్తరిస్తూపోతుంటుంది. అందుకు మా జీవితాలే ప్రత్యక్ష సాక్ష్యాలు. అలా చెప్పుకొనే భాగ్యాన్ని మాకిచ్చిన ' దేవునికి స్తోత్రము'. ఇది మాకే కాదుగాని పై వివరణలో వలే ఉన్న అందరి జీవితాల్లోనూ దేవుడు కన్పరచగలరు. దేవునిలో మహిమ పర్చబడాలంటే సువార్త ప్రకటిస్తూ, మనకున్నంతలోనే అవసరం ఉన్న వారికి సహకరిస్తుండాలి. అట్టి వారిని గురించి లోకానికి ఘనంగా తెలియజేయుట దేవునికిష్టం. ఆయన పని అది. మనము ఆయన పనిచేస్తే, మనపనులు ఆయన చేస్తారని నమ్ముటే విశ్వాసం. క్రైస్తవనాడు మొదట్నుంచి చెబుతున్నదిదే! కాబట్టి దేవుడే మనకోసం ఆలోచించి, తన కోసం మన యెడల పనులు నెరవేరుస్తుంటే ఈ లోకంలో మన జీవితాలు ఎంతో ధన్యమవుతాయి. లోకంలో గుర్తించబడి మహిమ పర్చబడతాయి. ఇలా ఆలోచిస్తుంటేనే మనసు ఎంతో ఉప్పొంగిపోవుట లేదూ.....! అందుకు ' దేవునికి స్తోత్రము'

## అగాపే టి.వి. క్లబ్ 2వ వార్షికోత్సవ వేడుక

7 జూలై, విశాఖపట్నం : స్థానిక ఉడా చిల్డ్రన్స్ థియెటర్‌లో అగాపే టి.వి. క్లబ్ 2వ వార్షికోత్సవ వేడుక జరిగింది. ఈ వేడుకలో ' శుభవార్త టి.వి. ఛానల్ ' ఛైర్మన్ దంపతులు నెహ్రూ ధైర్యం, ప్రిస్కిల్లా ధైర్యంలు, అగాపే సంస్థల కాపర్లు పాల్గొన్నారు. కార్యక్రమ నిర్వాహణ బ్రదర్ నాగేశ్వర రావు చూచుకొన్నారు. ఉత్తరాంధ్ర అగాపే సంస్థ నాయకులు పాస్టర్ వేల్పుల సత్యనారాయణ పర్యవేక్షించారు. ముఖ్యవక్త అగాపే సంస్థ పెద్దయైన రంజిత్ ఓఫీర్ ప్రసంగానికి ముందు వారి సంస్థకు సంబంధించిన వివరాలు తెలియజేసారు. కాపర్లకు తగు సూచనలు చేసారు. రాబోవు కాలంలో సేవను గురించి జాగ్రత్తలు చెప్పారు.

**ఇప్పుడు వెబ్‌సైట్‌లో... మన క్రైస్తవనాడు www.christavanaadu.com**

## దేవుని ఎవరైనా చూచారా!

గత సంచికలో సాంకేతిక కారణాలవల్ల క్రింద ఇవ్వబడిన వాక్యాలు మిస్ అయినందుకు చింతిస్తున్నాం. పాఠకుల సౌలభ్యంకొరకు ఆ వాక్యాలు దిగువ ఇచ్చాం. పాఠకులిది గమనించగలరు. -ఎడిటర్

★ మీరాయనను చూడక పోయినను ........

★ అదృశ్యుడైన వానిని 'చూచుచున్నట్టు' .......

★ దేవుడాయనను మూడవదినమున లేపి 'ప్రజలందరికికాక' దేవుని చేత ముందుగా ఏర్పరబడిన సాక్షులుకే అనగా ఆయన మృతులలోనుండి లేచిన తరువాత ఆయనతో కూడా 'అన్నపానములు పుచ్చుకొనినమాకే' ఆయన 'ప్రత్యక్షముగా' కనబడునట్లు అనుగ్రహించెను.

★ అయినను నేను దేవునివలననైన సహాయం పొంది నేటివరకు నిలిచియుండి - క్రీస్తు శ్రమపడి మృతుల పునరుత్థానము పొందువారిలో మొదటివాడగుటచేత ఈ 'ప్రజలకును' 'అన్యజనులకును' వెలుగు ప్రచురింపబోవునని 'ప్రవక్తలును మోషేయు' ముందుగా చెప్పినవి కాక మరి ఏమియు చెప్పక, అల్పులకును, ఘనులకును సాక్ష్యమిచ్చుచుంటిని.

★ మేము క్రీస్తును శరీరరీతిగా ఎరిగియుండినను, ఇకమీదట ఆయనను ఆలాగు ఎరుగము.




# తెలుసుకుందాం!

**★ జ్ఞానుల పెదవులు తెలివిని వెదజల్లును**

❁ పురాతన గ్రీసు దేశంలోని స్పార్టా నగరంలో 30 ఏళ్లు దాటినా పెళ్లికాని పురుషులు ఓటు హక్కు కోల్పోయేవారు.

❁ శబ్దం శూన్యంలో కన్నా స్టీలు వాహకాల ద్వారా 15 రెట్లు వేగంగా పయనించగలదు.


❁ అమెరికా జాతీయపక్షి 'బాల్ ఈగిల్. కానీ దానికి బదులు నిప్పుకోడిని తమ దేశ జాతీయపక్షిగా ఎంచుకొని ఉంటే బాగుండేదని ఆ దేశ మాజీ అధ్యక్షుడు బెంజిమిన్ ఫ్రాంక్లిన్ అనేవాడు.

❁ క్రీ.పూ. 1766 నాటికే చైనీయులు కంచుకత్తులు వాడేవారు.

❁ సూర్యుడి గమన వేగం ఆధారంగా లెక్కిస్తే సంపూర్ణ సూర్యగ్రహణంలో ఆఖరు దశ ఎప్పుడూ 7 నిమిషాల 58 సెకన్లకు మించి ఉండదు.


❁ రోజ్(గులాబీ పువ్వు) అనే పదాన్ని షేక్స్పియర్ తన రచనల్లో 50 సార్లుకు పైగానే ఉదాహరించాడు.





❁ రోదసీలోకి వెళ్లిన వ్యోమగాములు రెండు అంగుళాల మేర ఎత్తు పెరుగుతారు. వెన్నుపూసలో ఉండే కార్టిలేజ్ భార రహిత స్థితిలో వ్యాకోచించడమే ఇందుకు కారణం.

❁ కోళ్లంటే ఇష్టపడటాన్ని అలెక్‌థోఫీలియా అంటారు.



❁ లియోనార్డో డావిన్సీ తల్లి కాటేరినా ఒక వ్యవసాయ కూలీ.



❁ భూమ్యాకర్షణ శక్తి అధికంగా ఉండేచోట గడియారాలు నెమ్మదిగా తిరుగుతాయి.

❁ ఒలింపిక్స్‌కు అతిథ్యమిచ్చి ఒక్క బంగారు పతకం కూడా సాధించేలేక పోయిన ఏకైక దేశం కెనడా.



❁ ప్రాచీన ఇంగ్లీష్ ప్రమాణాల ప్రకారం 'ఒన్ మూమెంట్ ' అంటే ఒకటిన్నర నిమిషం అని అర్థం.

❁ జీవరాశి మొత్తంలో వెల్లకిలా పడుకొని నిద్రపోగల ఏకైకజీవి మనిషి మాత్రమే.


❁ ఏటా ప్రపంచవ్యాప్తంగా ఎర్రరంగు వాహనాలే ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయని ఒక అధ్యయనం.



❁ యూరప్‌లో కాపీని ఒకప్పుడు 'అరేబియన్ వైన్' అని పిలిచేవారు.


❁ భూగర్భంలోకి తవ్వుకుంటూపోతే ఒక్కొక్క కిలోమీటర్‌కి 20 డిగ్రీల సెల్సియస్ మేర ఉష్ణోగ్రత పెరుగుతుంటుంది. భూమి కేంద్రభాగంలో 3,870 సెల్సియస్ వేడి ఉంటుందని అంచనా.

❁ థాయ్‌లాండ్‌లో గాలిపటాలు ఎగరేయటం ఒక ప్రొఫేషనల్ క్రీడ.



❁ ప్రపంచ వ్యాప్తంగా ఏటా సుమారు 72 మిలియన్ టన్నుల అరటి పండ్లు పండిస్తున్నారని అంచనా.





❁ మనం పీల్చుకునే ఆక్సిజన్‌లో 25 శాతం వరకు మెదడే ఉపయోగించుకుంటుంది.

RNI APTEL / 2006 / 17980

★ జ్ఞానము కలిగి తన నోరు తెరచును కృపగల ఉపదేశము ఆమె బోధించును






సిమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చ్ బిల్డింగ్ శతవార్షికోత్సవాలు జరుపుకున్న సందర్భాన శుభాకాంక్షలు

- క్రైస్తవనాడు


ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం!

## ముత్యాల సరాలు | అది స్వర్గం - ఇది నరకం

అది ధగద్ధగాయమానంగా వెలుగులు విరజిమ్ముతున్న స్వర్ణ సింహాసనం. అధిష్ఠించినవాడు, ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు లీనమై, సర్వము తానే అయిన వాడెవ్వడో ఆ సర్వ సృష్టికర్త. తీర్పు తీర్చడానికి దర్బారులో సర్వసన్నద్ధంగా ఉన్నాడు. మొదట చుట్టూరా ఉన్న ప్రజలను ఇరుపక్షాలుగా వేరు చేశాడు. కుడి ఎడమలకు విడదీశాడు. గంభీర కంఠస్వరం దశదిశల మ్రోగింది. కుడివైపు వారినుద్దేశించి అన్నాడు: "నా తండ్రి ఆశీస్సులకు అర్హులైన మిత్రులారా, రండి. మీ కొరకు ఏర్పాటైన స్వర్గలోకంలోకి ప్రవేశించండి. ఎందుకంటే, నేను ఆకలిగొన్నప్పుడు మీరు భోజనం పెట్టారు. దాహానికి నీరిచ్చి సేద తీర్చారు. పరదేశినై వస్తే పంచనజేర్చి ఆతిథ్యమిచ్చారు. వస్త్రదానం చేసి వనరులు సమకూర్చారు. అనారోగ్యంలో నన్నాదుకొన్నారు. అపనిందపాలై చెఱసాలలో శిక్షననుభవిస్తుంటే పరామర్శగా నన్ను పలకరించారు".

ఆశ్చర్యంతో అప్పుడు వారన్నారు: "ప్రభూ, మేమా! మీకు అన్ని సేవలు చేశామా?అదెప్పుడు? మీకు ఇన్ని కష్టాలొచ్చాయా! మాకు తెలియనే తెలియదే? మీరు కష్టాలపాలు ఎందుకయ్యారు? మీకిన్ని సేవలు చేసే భాగ్యం మాకు కలిగిందా?" అందుకాయన మందహాసం చేస్తూ, "దైన్యస్థితిలో ఉన్న నా పేద సోదరులకు మీరు చేసిన ప్రతి సత్కార్యం నాకు చేసినట్టే " అని ఎడమవైపు ఉన్నవారితో ఇలా అన్నాడు. "వెళ్ళండి, దుష్టుని దూతల కోసం సిద్ధం చేసిన అగ్నిజ్వాలలో అనవరతం శ్రమననుభవించండి. నా కుడివైపు నున్నవారు చేసిన ఏ ఒక్క సత్కార్యం మీరు నాకు చెయ్యలేదు". వారప్పుడు భయభ్రాంతులై "ప్రభూ, మీరేమిటి! మీకు దుస్థితేమిటి! మేము సాయం చేయకపోవడమేమిటి!" అన్నారు. దానికాయన జవాబు: 'హీనస్థితిలోనున్న నిరుపేద వారికి మీరు ఏ సాయమూ చేయకపోవడం నాకు చెయ్యకపోవడమే'. పాపం వారు శాశ్వత శిక్షపాలయ్యారు. మంచివారు ఆనందమయ అనంత జీవితంలోకి అడుగుపెట్టారు. ఏది స్వర్గమో ఏది నరకమో మీకీపాటికి తెలిసిపోయి వుంటుంది.

ఉత్కంఠ భరితమైన ఈ ఉదంతం బైబిలులో భాగమైన "క్రొత్త నిబంధన" గ్రంథంలో ఉటంకించబడింది. ఆ రాజు రారాజైన దేవుడు. ఇరుపక్షాల వారు మానవులు, నిరుపమానమైన ఇలాంటి విషయాలు కోకొల్లలుగా చెప్పాడు క్రీస్తు యేసు. అంతేకాదు ఆయన ఏది చెప్పినా ప్రతీకాత్మకంగా చెప్పాడు. మంచి మాటలు చెప్పినందుకు చెడ్డవారికి కోపం వచ్చి ఆయనను సిలువ వేసి చంపారు. చంపుతున్న వారిని "వారేమి చేయుచున్నారో వారికి తెలియదు గనుక వారిని క్షమించు"మని దేవుడిని ప్రార్థించాడు. ఆయన జీవిత చరిత్ర, చేసిన ప్రభోదాలు, వాటి వ్యాఖ్యానాలు, అదే క్రొత్త నిబంధన గ్రంథంలో వున్నాయి. అది 564 పుటలు గల పుస్తకం. పోస్టుకార్డు వ్రాస్తే చాలు, మీ చిరునామాకు ఉచితంగా పంపిస్తాం.

**నిరీక్షణ**

ఇదీ అడ్రసు
పోస్ట్‌బాక్స్ నెం.608,
సీతమ్మధార, విశాఖపట్నం-13.

ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం! ఉచితం!



ఓదారుస్తున్న వై.యస్. జగన్‌తో బ్రదర్ మస్కు జాన్సన్

## బ్రదర్ మస్కు జాన్సన్ ఆధ్వర్యంలో రాజధానిలో దివంగత ముఖ్యమంత్రి డా. వై.యస్. రాజశేఖర రెడ్డి జన్మదిన వేడుకలు

జంట నగరాల్లో దివంగత ముఖ్యమంత్రి డా.వై.యస్. రాజశేఖరెడ్డి వేడుకలు ఘనంగా జరిగాయి. పార్టీ శ్రేణులు ఈ వేడుకలను అంగరంగవైభవంగా జరిపారు. బ్రదర్ మస్కు జాన్సన్ ఆధ్వరంలో విధవరాళ్లకు చీరలపంపిణీ, నెలనెలా ఇచ్చే పెన్షన్లు పంపిణీ చేసారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా నాగర్‌కర్నూల్ ఎం.ఎల్.ఏ. మోహన్‌గౌడ్ పాల్గొన్నారు. కార్యకర్తలతోబాటు అనేక మంది క్రైస్తవ సహోదరులు, సహోదరీలు పాల్గొన్నారు. కార్యక్రమ ఏర్పాట్లను సక్రమంగా చేసి నిర్విఘ్నంగా జరిగేందుకు కృషి చేసిన బ్రదర్ మస్కు జాన్సన్ మరియు ఆయన సోదరులు సామ్యేల్‌ను అందరూ అభినందించారు.



కేక్ కట్ చేస్తున్న బ్రదర్ మస్కు జాన్సన్. ఆయనకు ఆ వైపు నాగర్ కర్నూల్ ఎం.ఎల్.ఏ. మోహన్ గౌడ్, ఈ వైపు బ్రదర్ సామ్యేల్ తదితరులు



చీరలను పంపిణీ చేస్తున్న బ్రదర్ మస్కు జాన్సన్

★ నీతిమంతుని నోరు జ్ఞానోపదేశమును పలుకును మూర్ఖపు మాటలు పలుకు నాలుక పెరికివేయబడును

Printed ,Published , Edited and Owned by Y.Kanaka Raju, 3-178, 5th Lane, Adarsh Nagar, Visakhapatnam - 530 040, Andhra Pradesh.
Ph : 9346960601,9490266640. E-mail: y_kanakaraju1@yahoo.co.in., Printed at Vinay Offset Printers, Premasamajam Road, Dabagardens, Visakhapatnam - 20